8,889 కోట్ల విలువైన ఎన్నికల తాయిలాలు సీజ్

సీ విజిల్‌కు 4.24 లక్షల ఫిర్యాదులు

న్యూఢిల్లీ, మే 18: లోక్‌సభ ఎన్నికల సోదాల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.8,889 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఓటర్లను ప్రలోభ పెట్టే పలు రకాల బహుమతులను స్వాధీనం చేసుకొన్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం వెల్లడించింది. వీటిల్లో మాదక ద్రవ్యాలది సింహభాగం అని, రూ.3,959 కోట్లతో 45 శాతం వరకు ఉన్నదని తెలిపింది. రూ.849.15 కోట్ల నగదు, రూ.814.85 కోట్ల విలువైన మద్యం, రూ.1,260.33 కోట్ల విలువైన లోహాలను సీజ్ చేశామని ఈసీ వెల్లడించింది. అలాగే 'సీ-విజిల్' యాప్‌కు 4,24,317 ఫిర్యాదులు రాగా, 4,23,908 పరిష్కరించామని తెలిపింది.

మీ ఆఫీసుకొస్తాం.. అరెస్ట్ చేసుకోండి

- ప్రధాని మోదీకి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సవాల్
- బీజేపీ ఆఫీసు ముందు 'జైల్ భరో' చేపడతామని వెల్లడి

న్యూఢిల్లీ, మే 18: వివాదాలు, కేసులతో ఆప్‌ను అణగదొక్కలేరని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. ప్రజల గుండెల్లో ఆప్ స్థానం సంపాదించుకున్నదని, ఒక్క నాయకుడిని జైల్లో పెడితే..వందలాది మంది నాయకులు పుట్టుకొస్తారని చెప్పారు. ఆదివారం బీజేపీ ప్రధాన కార్యాలయం ముందు 'జైల్ భరో' ఆందోళన చేపడతామని కేజ్రీవాల్ ప్రకటించారు. తన వ్యక్తిగత సహాయకుడు బిభవ్‌కుమార్ అరెస్టుపై కేజ్రీవాల్ స్పందిస్తూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. ఆప్ నేతలను కేంద్రంలోని బీజేపీ సర్కార్ అరెస్టు చేస్తున్నదని, ఇలాంటి చర్యలతో ఆప్‌ను అణగదొక్కలేరని అన్నారు. 'ప్రధాని మోదీకి ఒక్కటి చెప్పదలుచుకున్నా. ఒక్కొక్కరిని అరెస్టు చేయటం అనే ఆటను మీరు ప్రారంభించారు. ఆదివారం బీజేపీ కార్యాలయానికి వస్తాం. ఆప్ నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు..మీకు కావాలనుకునే వారిని జైల్లో పెట్టండి. మమ్మల్ని జైల్లో పెడితే..ఆప్‌ను అణచివేయొచ్చని అనుకుంటున్నారు. అలా జరగదు. కావాలంటే ప్రయత్నించండి' అని కేజ్రీవాల్ చెప్పారు. 'రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేశాం, మొహల్లా క్లినిక్‌లను తీసుకొచ్చాం, ఉచిత, నిరంతరాయ కరెంట్‌ను సరఫరా చేస్తున్నాం. ఇదే ఆప్ చేసిన నేరం. ఎందుకంటే ఇవేవీ బీజేపీ చేయలేదు కాబట్టి' అంటూ బీజేపీ తీరును ఎండగట్టారు.

కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్ అరెస్ట్

మలివాల్ ఆరోపణలన్నీ కట్టుకథేనన్న ఆప్

న్యూఢిల్లీ, మే 18: ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై దౌర్జన్యం చేశారన్న ఆరోపణలపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. పోలీసులకు తమ పూర్తి సహకారం అందిస్తామని బిభవ్ న్యాయవాది తెలిపారు. మరోవైపు స్వాతి మలివాల్ ఆరోపణలు కట్టుకథేనని ఆప్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఘటన రోజు నాడు వాస్తవాలు వెల్లడించే ఓ వీడియోను ఆప్ శనివారం ఎక్స్‌లో షేర్ చేసింది. ఆ వీడియోలో మహిళా రక్షణ సిబ్బంది స్వాతి మలివాల్ చేయి పట్టుకుని కేజ్రీవాల్ ఇంటి నుంచి బయటకు పంపిస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఇంటి బయటివరకు ఆమె కూల్‌గానే వారితో నడుచుకుంటూ వచ్చారు. ఆమెకు దెబ్బలు తగిలినట్టు ఎక్కడా కనిపించ లేదు. ఇంటి మెయిన్ గేటు దాటిన తర్వాత సిబ్బంది నుంచి తన చేతులను విడిపించుకుని వారితో ఏదో అన్నారు.

అరెస్ట్ భయంతోనే ఇదంతా: ఆతిశీ

స్వాతి మలివాల్‌పై ఢిల్లీ మంత్రి ఆతిశీ తీవ్ర ఆరోపణలు చేశారు. స్వాతి మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో తన కార్యాలయంలో జరిపిన అక్రమ నియామకాల కేసులో అరెస్ట్ భయాన్ని ఎదుర్కొంటున్నారని, అందుకే బీజేపీ బ్లాక్‌మెయిల్‌కు భయపడి కేజ్రీవాల్‌పై కుట్రలో భాగస్వాములయ్యారని ఆరోపించారు. ఆ రోజు బిజీగా ఉన్న కారణంగా కేజ్రీవాల్ ఆమెను కలవలేదని, ఒక వేళ కలిసి ఉంటే ఈ రోజు బిభవ్ కుమార్‌పై చేసిన ఆరోపణలు కేజ్రీవాల్‌పై చేసి ఉండేవారని అన్నారు. మలివాల్‌పై బిభవ్ చేసిన ఫిర్యాదుపై కేసు ఎందుకు నమోదు చేయలేదని ఢిల్లీ పోలీసులను ఆమె ప్రశ్నించారు. ఆమె కాల్ రికార్డులను పరిశీలిస్తే బీజేపీ నేతలతో ఆమెకు ఉన్న సంబంధం బయటపడుతుందన్నారు.

అమెరికాలో 'రియల్' కుదేలు

- విక్రయాలు లేక ఘోస్ట్ హౌస్‌లుగా భారీ భవంతులు, మాల్స్
- ఆర్థిక మాంద్యం, వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్‌తో తగ్గిన గిరాకీ
- బ్యాంకు రుణభారం పెరగడంతో రియల్టర్ల డిస్కౌంట్ బాట
- 50% డిస్కౌంట్‌తో మన్‌హట్టన్, లాస్‌ఏంజెల్స్‌లోని భవనాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): అమెరికాలో రియల్ ఎస్టేట్ రంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకొన్న ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, భారీ భవంతులు, ఆఫీసు స్థలాలు విక్రయాలు లేక ఘోస్ట్ హౌస్‌లుగా మారుతున్నాయి. అమ్మకాలు భారీగా పతనమవ్వడంతో రియల్టర్లు డిస్కౌంట్ల బాట పడుతున్నారు. 50 శాతం మేర రాయితీ ప్రకటిస్తున్నారు.

రుణాల భారం భరించలేక..

కరోనా సృష్టించిన విలయం అమెరికాపై తీవ్రంగా పడింది. వాణిజ్య కార్యకలాపాలే కాదు రియల్ ఎస్టేట్ లావాదేవీలు కూడా గణనీయంగా పడిపోయాయి. అయితే, సంక్షోభం ముగిసిన తర్వాత విక్రయాలు ఊపందుకొంటాయనుకొన్న రియల్టర్ల అంచనాలు తారుమారయ్యాయి. ఆర్థిక సంక్షోభ భయాలు, కరోనా నేర్పించిన ఆరోగ్య సంరక్షణ పాఠాలతో వైద్య ఖర్చులకు బడ్జెట్‌ను పెద్దమొత్తంలో కుటుంబాలు కేటాయించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ పెరగడంతో ఆఫీసు స్పేస్‌లకు గిరాకీ తగ్గడం వెరసి రియల్ ఎస్టేట్ రంగంపై పెను ప్రభావం పడింది. కరోనాకు ముందు బ్యాంకుల నుంచి వడ్డీకి పెద్ద మొత్తంలో రుణాలను తీసుకొచ్చిన రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ భవనాలను నిర్మించాయి. విక్రయాల ద్వారా వచ్చిన మొత్తంతో బ్యాంకు బకాయిలను చెల్లించాలనుకొన్నాయి. కానీ, కరోనా తర్వాత కొనుగోలుదారుల నుంచి ఆశించిన మేర స్పందన రావట్లేదు. మరోవైపు బ్యాంకుల నుంచి ఒత్తిడి పెరగసాగింది. దీంతో చేసేదేమీ లేక నిర్మాణం ఖర్చుల కంటే తక్కువ మొత్తాలకే విక్రయాలు జరుగుతున్నాయి. మన్‌హట్టన్‌లో ఓ బ్రోకర్ ఓ భారీ భవంతిని 50 శాతం డిస్కౌంట్‌తో ఇటీవల కొనుగోలు చేశాడు. లాస్‌ఏంజెల్స్‌లో ఓ బహుళ అంతస్తుల భవనాన్ని ఓ వ్యక్తి పదేండ్ల కిందట కొనుగోలు చేశాడు. గత డిసెంబర్‌లో దాన్ని కొన్న ధర కంటే 45 శాతం తక్కువకు విక్రయించాడు. ఇలా చెప్పుకొంటూ పోతే ఈ జాబితా పెద్దదే. అమెరికాలోనే కాకుండా జర్మనీ వంటి ఐరోపా దేశాలతోపాటు భారత్‌లోనూ రియల్ ఎస్టేట్ కుదేలవుతున్న సంకేతాలు కనిపిస్తున్నట్టు నిర్మాణ రంగ నిపుణులు చెబుతున్నారు.

రియల్ ఎస్టేట్ కుదేలుకు ప్రధాన కారణాలు

- ఆర్థిక మాంద్యం భయాలు
- కరోనా సంక్షోభంతో వైద్య ఖర్చుల కోసం కుటుంబాలు ఎక్కువ బడ్జెట్ కేటాయించడం
- వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ పెరుగడంతో ఆఫీసు స్పేస్‌లకు తగ్గిన గిరాకీ
- డోర్ డెలివరీ సర్వీసుల కారణంగా మాల్స్, రెస్టారెంట్లకు తగ్గిన కస్టమర్ల తాకిడి.

ఐదో దశ పోలింగ్ రేపే

బరిలో రాహుల్, రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఐదో విడత పోలింగ్ సోమవారం జరుగుతుంది. దీనికి సంబంధించిన ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. అమేథీ, రాయ్‌బరేలీ సహా 49 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. మొత్తం 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో 82 మంది మహిళలు. అమేథీ నుంచి కేంద్ర మంత్రి, బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ, రాయ్‌బరేలీ నుంచి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, లక్నో నుంచి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పోటీ చేస్తున్నారు.

అధిక పింఛన్‌కు మోక్షమెప్పుడో?!

నత్తనడకన 17 లక్షల దరఖాస్తుల పరిశీలన

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): అర్హులైన వారికి అధిక పింఛన్ చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించి 17 నెలలు గడుస్తున్నప్పటికీ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్‌లో చలనం లేదు. దీంతో ఉద్యోగులు, పెన్షనర్ల పట్ల కేంద్రం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఉద్యోగ, కార్మిక సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. అధిక పెన్షన్ కోసం ఉద్యోగులు, కార్మిక సంఘాలు ఏండ్ల తరబడి చేస్తున్న న్యాయ పోరాటం ఫలితంగా ఎట్టకేలకు 2022 నవంబర్‌లో సుప్రీం కోర్టు వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చే అర్హులైన కార్మికులు, ఉద్యోగులకు అధిక పింఛను చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు అధిక పింఛన్‌కు అర్హులైన వారి నుంచి ఈపీఎఫ్‌వో దరఖాస్తులు స్వీకరించింది. దేశవ్యాప్తంగా 17.48 లక్షల మంది దరఖాస్తు చేసుకొన్నారు. అయితే వాటిని పరిశీలించి అధిక పింఛన్ చెల్లించడానికి చర్యలు చేపట్టాల్సిన ఈపీఎఫ్‌వో.. మార్గదర్శకాల పేరిట అనేక కొర్రీలు పెడుతున్నదని పింఛనుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారి ఒకరు స్పందిస్తూ... ఈపీఎఫ్‌లో సిబ్బంది కొరత వల్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నెమ్మదిగా సాగుతున్నదని చెప్పారు. తమ సిబ్బంది లోక్‌సభ ఎన్నికల విధులను కూడా నిర్వహిస్తుండటంతో ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టొచ్చని తెలిపారు.

బీజేపీకి ఆరెస్సెస్‌తో పనిలేదు!

- ఇప్పుడు మేం ఎదిగాం.. పూర్తి సామర్థ్యం సాధించాం
- సొంతంగా మా పనుల్ని చక్కబెట్టుకోగలుగుతున్నాం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ/(స్పెషల్ టాస్క్ బ్యూరో), మే 18: బీజేపీ, ఆరెస్సెస్ సంబంధాలపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆరెస్సెస్‌పై ఆధారపడే స్థాయి నుంచి సొంతంగా తన వ్యవహారాలను తానే చక్కబెట్టుకొనే స్థాయికి బీజేపీ చేరుకొన్నదని వ్యాఖ్యానించారు. ఎవరి అవసరం లేకుండానే ఇప్పుడు బీజేపీ తన కార్యకలాపాలను సొంతంగా నడుపుకొంటున్నదన్న ఆయన ఒక విధంగా ఆరెస్సెస్‌తో తమకు పనిలేదన్నట్టు పరోక్షంగా మాట్లాడారు. సైద్ధాంతిక సంస్థగా ఉన్న ఆరెస్సెస్ కూడా తన పని తాను చూసుకొంటున్నదని నడ్డా పేర్కొన్నారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ మేరకు నడ్డా వెల్లడించారు.

ఆరెస్సెస్ దాని పని అది చూసుకొంటున్నది

వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఆరెస్సెస్‌తో బీజేపీకి ఉన్న సంబంధాలకు, ప్రస్తుతం ఉన్న సంబంధాలకు మధ్య తేడా ఏమిటని అడిగిన ప్రశ్నకు నడ్డా స్పందించారు. 'ప్రారంభంలో మాకు (బీజేపీ) తక్కువ బలం ఉండేది. చిన్న శక్తిగా ఉండే వాళ్లం. అలాంటి సమయంలో ఆరెస్సెస్ అవసరం మాకు తప్పనిసరిగా మారింది. ఆరెస్సెస్‌పై ఆధారపడే పరిస్థితి. అయితే నేడు మేం ఎదిగాం, సొంత బలం, సామర్థ్యం సాధించాం. బీజేపీ తన కార్యకలాపాలను తానే సొంతంగా నడుపుకొనే స్థాయికి చేరింది. ఇదే అప్పటికీ, ఇప్పటికీ ఉన్న తేడా' అని పేర్కొన్నారు. బీజేపీకి ఇప్పుడు ఆరెస్సెస్ సపోర్ట్ అవసరం లేదా? అని అడిగిన మరో ప్రశ్నకు నడ్డా సూటిగా సమాధానం చెప్పలేదు. కానీ, 'ఆరెస్సెస్ అనేది ఒక సాంస్కృతిక, సామాజిక, సైద్ధాంతిక సంస్థ. మా వరకు మేము (బీజేపీ) ఒక రాజకీయ పార్టీ. అలాంటప్పుడు ప్రతీ పార్టీకి ప్రత్యేకమైన బాధ్యతలు ఉంటాయి. అటు ఆరెస్సెస్, ఇటు బీజేపీ.. ఎవరి పని వాళ్లు చేసుకొంటున్నాం' అని నడ్డా పేర్కొన్నారు.

నేరం రుజువైతే ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోండి

మా కుటుంబంపై కుట్ర జరుగుతున్నది: దేవెగౌడ

ప్రజ్వల్‌పై అరెస్ట్ వారెంట్

బెంగళూరు, మే 18: తన మనవడు ప్రజ్వల్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై మాజీ ప్రధాని దేవెగౌడ శనివారం తొలిసారి స్పందించారు. నేరం రుజువైతే ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరమూ లేదని స్పష్టం చేశారు. జరిగినదంతా పరిశీలిస్తే తమ కుటుంబం పరువు తీసేందుకు, రాజకీయంగా దెబ్బ తీసేందుకు కుట్ర జరిగినట్టు అనిపిస్తున్నదని ఆయన అన్నారు. తన కుమారుడు జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపై తప్పుడు లైంగిక వేధింపుల కేసులు పెట్టారని ఆరోపించారు.కాగా, విదేశాల్లో ఉన్న ప్రజ్వల్ రేవణ్ణపై ప్రజాప్రతినిధుల కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.

డీకే 100 కోట్లు ఆఫర్ చేశారు: దేవరాజే గౌడ

కర్ణాటక సెక్స్ స్కాండల్ కేసుతో ముడిపెట్టి..ప్రధాని మోదీ, కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామిల పేరు ప్రతిష్టలను దిగజార్చాలంటూ డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తనకు రూ.100 కోట్లు ఆఫర్ చేశాడని ఆ రాష్ట్ర బీజేపీ నాయకుడు జీ దేవరాజే గౌడ ఆరోపించారు.

'హెచ్-1బీ'పై టెకీల ఆందోళన

- వీసా దరఖాస్తులను తగ్గిస్తున్న టాప్ ఇండియన్ కంపెనీలు
- 8 ఏండ్లలో 56 శాతం కోత

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): అమెరికాలో పనిచేయాలనుకొనే ప్రతి భారతీయుడు సాఫ్ట్‌వేర్ రంగానికే తొలి ప్రాధాన్యం ఇస్తాడు. అయితే, గడిచిన ఎనిమిదేండ్లలో హెచ్-1బీ వీసా దరఖాస్తులను ప్రముఖ భారత సాఫ్ట్‌వేర్ కంపెనీలు 56 శాతం తగ్గించేశాయి. 2015 ఆర్థిక సంవత్సరంలో 15,166 దరఖాస్తులకు అనుమతినివ్వగా 2023 నాటికి ఇది 6,732కు పడిపోయిందని అమెరికా మేధో సంస్థ నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ వెల్లడించింది.

కారణాలివే..

అమెరికాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న భారతీయ కంపెనీలు గడిచిన పదేండ్లుగా అక్కడి టెక్ నిపుణులనే ఉద్యోగులుగా చేర్చుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆటోమేషన్, ఏఐ వాడకం పెరిగింది. ఉద్యోగుల జీవన వ్యయానికి ఎక్కువ మొత్తం వెచ్చించాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. వెరసి హెచ్-1బీ వీసా దరఖాస్తులను కంపెనీలు తగ్గిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికాలోనే ఉన్నత విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులను రిక్రూట్ చేసుకోవడానికి కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి.

ఎన్ని గంటలైనా పని చేసుకోవచ్చు!

న్యూఢిల్లీ: భారత్ సహా విదేశాలకు చెందిన విద్యార్థులకు లబ్ధి చేకూర్చేలా గ్రాడ్యుయేట్ వీసా ప్రోగ్రామ్ నిబంధనల్లో ఆస్ట్రేలియా కీలక మార్పులు చేసింది. విదేశీ విద్యార్థుల పని గంటలపై పరిమితిని ఎత్తివేసింది. ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త రూల్స్ ప్రకారం ఆస్ట్రేలియాలో విదేశీ విద్యార్థులు ఏ ఇండస్ట్రీలో అయినా తమ ఇష్ట ప్రకారం ఎన్ని గంటలైనా అపరిమితంగా పని చేసుకోవచ్చు. విద్యార్థుల గరిష్ఠ వయో పరిమితిని 35 ఏండ్లుగా నిర్ణయించారు. ఆస్ట్రేలియాలో గుర్తింపు పొందిన కోర్సు పూర్తి చేసిన తర్వాత, ఇతర దేశాల విద్యార్థులు తాత్కాలిక గ్రాడ్యుయేట్ వీసాకు అర్హులు అవుతారు. దీంతో ఆస్ట్రేలియాలో ఉండేందుకు అవకాశం ఏర్పడుతుంది. అదే విధంగా విద్యార్థులు తమ కుటుంబాలను ఆస్ట్రేలియాకు తీసుకొని పోయే అవకాశంతో పాటుగా అక్కడ అపరిమిత గంటలు ఉద్యోగం చేసుకొనే అవకాశం వస్తుంది.

కిర్గిజ్‌స్థాన్‌లో భారత విద్యార్థులపై దాడులు

బిష్కెక్: కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో భారత్, పాక్, బంగ్లాదేశ్ విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయి. స్థానికులు వైద్య కళాశాలల హాస్టళ్లపై హింసాత్మకంగా విరుచుకుపడటంతో ముగ్గురు పాక్ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. భారత విద్యార్థులతో సహా మరికొందరు గాయపడినట్టు తెలుస్తున్నది. ఓ హాస్టల్ వద్ద పాక్, ఈజిప్ట్ సహా ఇతర దేశాల విద్యార్థులు, స్థానికుల మధ్య జరిగిన ఘర్షణ ఈ పరిస్థితికి దారి తీసినట్లు సమాచారం. దీంతో బిష్కెక్ నగర వీధుల్లోనూ ఘర్షణలు జరిగాయి. విదేశీయుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురు విదేశీయులను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్తున్నారు. పరిస్థితి సాధారణ స్థితికి చేరే వరకు విద్యార్థులు హాస్టళ్లలోనే అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తమను సంప్రదించాలని భారత్ ఎంబసీ భారతీయులను కోరింది. ఫోన్ నంబరును ట్వీట్ చేసింది.

'స్మిషింగ్'తో జాగ్రత్త

- ప్రలోభపెట్టే ఎస్సెమ్మెస్‌లతో సొమ్ము కాజేస్తున్న నేరగాళ్లు
- బ్యాంక్ మెసేజ్‌ల ఫార్మాట్ గుర్తుంచుకోవడమే రక్ష

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాదారులను మోసగించేందుకు సైబర్ నేరగాళ్లు మరో కొత్త మార్గం అనుసరిస్తున్నారు. ఎస్ఎంఎస్ ఫిషింగ్(స్మిషింగ్) ద్వారా ప్రలోభపెట్టే ఎస్ఎంఎస్‌లను పంపించి, ముఖ్యమైన సమాచారాన్ని చెప్పాలని లేదా సొమ్మును బదిలీ చేయాలని బ్యాంకు ఖాతాదారులను అడుగుతున్నారు.

ఎలా మోసం చేస్తారు?

సైబర్ నేరగాళ్లు ఓ మొబైల్ నంబరు నుంచి బ్యాంకు ఖాతాదారుకు 'మీ బ్యాంకు ఖాతాలో సొమ్ము క్రెడిట్ చేశా'మంటూ ఎస్ఎంఎస్ పంపిస్తారు. బ్యాంకులు పంపించే ఎస్ఎంఎస్‌ల మాదిరిగానే ఈ ఎస్ఎంఎస్ కూడా ఉంటుంది. ఆ తర్వాత ఆ ఖాతాదారుకు ఫోన్ చేస్తారు. పొరపాటున మీ ఖాతాలో సొమ్ము జమ చేశామని చెబుతారు. ఆ సొమ్మును ఓ యూపీఐ నంబరుకు తిరిగి పంపించాలని కోరతారు. అయితే బ్యాంకులు పంపించే ఎస్ఎంఎస్‌లు మొబైల్ నంబరు నుంచి రావనే సంగతిని గుర్తు చేసుకోవాలి. ఇటువంటి ఎస్ఎంఎస్‌ల తోపాటు మాల్‌వేర్‌ను కూడా పంపించి, డౌన్‌లోడ్ చేసుకోవాలని కూడా ఖాతాదారును ప్రలోభపెట్టే అవకాశం ఉంటుంది. కీలకమైన సమాచారాన్ని రాబట్టేందుకు మాయదారి లింకులను కూడా పెట్టవచ్చు.

అధికారిక ఎస్ఎంఎస్ ఎలా ఉంటుంది?

బ్యాంకులు పంపించే ఎస్ఎంఎస్‌లపైన ఆరు క్యారెక్టర్లతో ఆల్ఫాన్యూమరిక్ కోడ్ ఉంటుంది. ఉదాహరణకు, హెచ్‌డీఎఫ్‌సీ బీకే, ఐసీఐసీఐబీ వంటి కోడ్ ఉంటుంది. ఈ కోడ్ కేవలం అంకెలతో ఉండదు. ఉదాహరణకు, 567687, 808080 వంటివి ఉండవు. మోసగాళ్లు తరచూ వ్యక్తిగత మొబైల్ నంబర్ల ద్వారానే ఎస్ఎంఎస్‌లను పంపిస్తారు.

మోసపూరిత ఎస్ఎంఎస్ వస్తే ఏం చేయాలి?

సైబర్ నేరగాళ్లు పంపిన సమాచారాన్ని నిశితంగా పరిశీలించాలి. సంయమనంతో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలి.

బెంగాల్ రాజ్‌భవన్ ఉద్యోగులపై కేసు

లైంగిక వేధింపుల ఫిర్యాదును అడ్డుకున్నందుకే

కోల్‌కతా, మే 18: పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్ ఉద్యోగిని ఆ రాష్ట్ర గవర్నర్ ఆనంద బోస్‌పై చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో ముగ్గురు రాజ్‌భవన్ ఉద్యోగులపై కేసు నమోదు చేసినట్టు శనివారం పోలీస్ అధికారులు తెలిపారు. ఘటన జరిగిన మే రెండో తేదీన బాధితురాలు రాజ్‌భవన్ నుంచి బయటకు పోకుండా ఈ ముగ్గురు అధికారులు అడ్డుకున్నారని, దీనిపై బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కాగా, తనను గవర్నర్ లైంగికంగా వేధిస్తున్నట్టు బాధితురాలు చేసిన ఆరోపణలపై పోలీసులు ఒక కమిటీని వేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

1.07 కోట్ల ఓట్లు పెరిగాయి

నాలుగు దశల తుది పోలింగ్ శాతాలు వెల్లడి

న్యూఢిల్లీ, మే 18: దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల్లో నాలుగు విడతల్లో పోలైన తుది ఓటింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసింది. ఈసీ చెప్పిన వివరాల ప్రకారం అన్ని నియోజక వర్గాల్లో కలిసి పోలింగ్ రోజున ప్రకటించిన ఓట్ల సంఖ్యకు, తాజాగా వెల్లడించిన తుది ఓట్ల మధ్య 1.07 కోట్ల తేడా ఉంది. మొదటి విడతలో ఈ తేడా 18.6 లక్షలు, రెండో విడతలో 32.2 లక్షలు, మూడో విడతలో 21.1 లక్షలు, నాలుగో విడతలో 33.9 లక్షలతో మొత్తం 1.07 కోట్ల ఓట్లు పెరిగాయి. సగటున ఒక్కో నియోజకవర్గంలో పెరిగిన ఓట్లు 28 వేలుగా తేలాయి. దీనిపై ఈసీ వివరణ ఇస్తూ ఎన్నికలైన తర్వాత ప్రకటించిన ఓట్లలో పోస్టల్ ఓట్లను చేర్చలేదని తెలిపింది.

మందారం టీతో టైప్-2 డయాబెటిస్ దూరం!

న్యూఢిల్లీ: టైప్-2 డయాబెటిస్‌తో బాధపడేవారు మందార పువ్వుతో తయారు చేసిన టీ లేదా నీళ్లు తాగడం వల్ల మంచి ఫలితాలను పొందవచ్చునని న్యూట్రిషనిస్ట్, డిజిటల్ క్రియేటర్ చైర్మన్ హా డొమిన్‌గెజ్ చెప్పారు. ఈ టీ లేదా వాటర్‌లో పంచదార కలపకూడదని తెలిపారు. దీనిలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-సీ పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ప్రముఖ న్యూట్రిషనిస్ట్ శుభ రమేశ్ మాట్లాడుతూ... మందార పువ్వు వల్ల టైప్-2 డయాబెటిస్ తగ్గుతుందని చెప్పడానికి కచ్చితమైన ఆధారాలు లేవన్నారు. అయితే బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను మేనేజ్ చెయ్యడంలో మందార పువ్వు ఉపయోగపడుతుందని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయన్నారు. మందార పువ్వులోని ఆర్గానిక్ యాసిడ్స్, ఫ్లేవనాయిడ్స్, యాంథోసయనిన్స్ డయాబెటిస్ మేనేజ్‌మెంట్‌కు ఉపయోగపడతాయని చెప్పారు.

మెదడుపై వాతావరణ మార్పుల ప్రభావం

న్యూఢిల్లీ, మే 18: వాతావరణంలో మార్పులు అటు పర్యావరణంపైనే కాకుండా ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నదని లాన్సెట్ జర్నల్ పేర్కొన్నది. వాతావరణంలో హెచ్చుతగ్గులు ప్రజల మెదడుపై దుష్ప్రభావం చూపుతున్నదని తెలిపింది. మైగ్రేన్ (పార్శ్వపు నొప్పి), అల్జీమర్స్ వ్యాధులు ఉన్నవారిలో ఈ ప్రభావం అధికంగా ఉంటున్నదని పేర్కొంది. అత్యధిక లేదా అత్యల్ప ఉష్ణోగ్రతలు మెదడు సంబంధిత వ్యాధులను ప్రభావితం చేస్తున్నాయని లండన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరాలజీకి చెందిన పరిశోధకుడు సంజయ్ సిసోడియా చెప్పారు.ఎండవేడిమి, వడగాలుల ప్రభావం మెదడుపై పడి చాలామంది పక్షవాతానికి గురవుతున్నారనివాతావరణ మార్పులు ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా ఉండాలంటే వెంటనే ఆ పరిస్థితులకు అలవాటుపడాలని పేర్కొన్నారు.

40 వేల కోట్లు గంగ పాలు!

- సరైన ఫలితాలివ్వని 'నమామి గంగె' ప్రాజెక్ట్
- పవిత్ర నదిలో పెరిగిన కాలుష్య తీవ్రత

న్యూఢిల్లీ, మే 18: 'కాలుష్య కాసారంగా ఉన్న గంగా నదిని స్వచ్ఛంగా మారుస్తాం. దీని నీటిని తాగునీటికి సైతం వినియోగించేలా తీర్చి దిద్దుతాం. దీని కోసం 'నమామి గంగె' ప్రాజెక్టును చేపడుతున్నాం' అంటూ పదేండ్ల క్రితం అధికారంలోకి వచ్చిన బీజే